ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5



చిత్తూరు
జిల్లా వార్తలు
ఆదివారం 14 సెప్టెంబరు 2025

డీసీసీబీలో ప్రక్షాళన



● గత పాలకవర్గం హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలు ప్రారంభం
● 11మంది ఉద్యోగుల సస్పెన్షన్....30మందిపై శాఖాపరమైన చర్యలు
● ముగ్గురు సర్వీసు నుంచి తొలగింపు...నలుగురు రిటైర్డు ఉద్యోగులకు నోటీసులు
● మలివిడతలో గత పాలకవర్గంపై చర్యలకు అవకాశం

7వ

హడలెత్తించిన ఒంటరి ఏనుగు

జనావాసాల్లో పరుగులతో ప్రజలకు ముచ్చెమటలు
గజదాడిలో తీవ్రంగా గాయపడ్డ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్
డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలతో రంగంలోకి కుంకీలు

6వ



గంగవరంలోని రాఘవేంద్ర స్వామి గుడి వద్ద రోడ్డుపై గజసంచారం

ఎస్పీగా తుషార్ డూడి



● నేడు బాధ్యతలు తీసుకునే అవకాశం

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): చిత్తూరు కొత్త ఎస్పీగా 2018వ సంవత్సర బ్యాచ్‌కు చెందిన తుషార్ డూడి నియమితులయ్యారు. ప్రస్తుతం బాపట్ల జిల్లాలో పని చేస్తున్న ఈయన నేడు బాధ్యతలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. సోమ, మంగళవారాల్లో జరిగే కలెక్టర్ల సదస్సుకు కలెక్టర్‌తో పాటు ఎస్పీ కూడా హాజరవ్వాల్సి ఉంది. దీంతో ఆదివారం బాధ్యతలు తీసుకుని ఈ సదస్సుకు హాజరయ్యే అవకాశం కనిపిస్తోంది.

వరుసగా మూడో జిల్లా

రాజస్థాన్‌కు చెందిన తుషార్ డూడి గ్రేహౌండ్స్ కమాండర్‌గా, చింతపల్లి ఏఎస్పీగా, కడప అడ్మిన్ ఏఎస్పీగా పనిచేశారు. ఎన్నికలకు ముందు గుంటూరు ఎస్పీగా పనిచేసిన ఈయన, ఎన్నికల తర్వాత అంటే, గతేడాది జూలై 17న బాపట్ల ఎస్పీగా బాధ్యతలు తీసుకున్నారు. తాజాగా చిత్తూరు ఎస్పీగా నియమితులయ్యారు. ఓ ఐపీఎస్ అధికారి వరుసగా మూడు జిల్లాల్లో ఎస్పీగా పనిచేయడమం చెప్పుకోదగ్గ విషయమే.

సీఎం జిల్లాలో సవాళ్లు

సార్వత్రిక ఎన్నికల తరువాత జిల్లాకు తొలి ఎస్పీగా తుషార్ వస్తున్నారు. సీఎం చంద్రబాబు జిల్లా కావడంతో అన్ని కోణాల్లో గమనించి ఈయన్ను నియమించినట్లు తెలుస్తోంది.ఇక్కడ ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని శాంతిభద్రతల్ని కాపాడాల్సిన అవసరం ఉంది. వైసీపీ హయాంలో అప్పటి పోలీసు అధికారులు ఇష్టానుసారంగా టీడీపీ నాయకులపై కేసులు పెట్టి వేధించారు. టీడీపీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పుంగనూరులో అక్రమ కేసులు, రౌడీషీట్ల జోలికి పోలీసులు వెళ్లలేదు. స్వయంగా సీఎం చంద్రబాబు ఎస్పీ మణికంఠకు కుప్పంలో చెప్పినా అక్రమ కేసులు తొలగించలేదు. జిల్లాలో చాలా చోట్ల సరైన స్థానంలో సరైన పోలీసు అధికారులు లేరు. దీంతో లాఅండ్‌ఆర్డర్ అదుపు తప్పింది. అలాగే సిబ్బంది సంక్షేమాన్ని ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో క్షేత్రస్థాయిలో పోలీసులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో శాంతిభద్రతలకు ఏ చిన్న ఇబ్బంది కలిగినా నేరుగా సీఎంకు మచ్చ తెచ్చేలా ఉంటుంది. దీంతో కొత్త ఎస్పీ అన్ని కోణాల్లో ఆలోచించి, అన్ని వర్గాలను సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

మణికంఠకు దక్కని పోస్టింగ్



గాడితప్పిన శాంతిభద్రతలు ● ప్రజాప్రతినిధులతో సమన్వయ లోపం
● 280 మంది ఏకపక్ష బదిలీతో సిబ్బందిలో అసంతృప్తి

చిత్తూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు ఎస్పీ మణికంఠ బదిలీ అయ్యారు.సార్వత్రిక ఎన్నికలకు ముందు 2024 ఏప్రిల్‌లో ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న ఆయన సుమారు 17 నెలల పాటు జిల్లాలో పనిచేశారు. ఈయన హయాంలో జిల్లాలో శాంతిభద్రతలు అదుపు తప్పాయనే విమర్శలున్నాయి.ఉదాహరణకు నగరి మండలం తడుకుపేటలో రెండు కులాల మధ్య ఏకంగా ఏడు రోజుల పాటు తీవ్ర స్థాయిలో ఘర్షణలు జరిగాయి.ఏకంగా ఆరు కౌంటర్ కేసుల్ని నమోదు చేశారు. అది గ్రామాల మధ్య గొడవగా మారింది. దాన్ని తొలిరోజే అరికట్టడంలో పోలీసులు ఫెయిలయ్యారు.అలాగే వి.కోటలో క్రికెట్ ఆడుకునే సమయంలో బాల్ ఓ మహిళకు తగిలిన ఘటన ఏకంగా రెండు మతాల మధ్య ఘర్షణగా మారింది. పరిస్థితి విషమించడంతో ఎస్పీతో పాటు కలెక్టర్ సుమిత్‌కుమార్ కూడా అక్కడే ఉండి పరిష్కరించాల్సి వచ్చింది.పుంగనూరు మండలం కృష్ణాపురంలో ఈ ఏడాది మార్చిలో టీడీపీ కార్యకర్త రామకృష్ణను అతని ఇంటి వద్దే వైసీపీ నేత, పెద్దిరెడ్డి అనుచరుడు వెంకటరమణ కొడవలితో నరికి చంపాడు. తనకు ప్రాణహాని ఉందని రామకృష్ణ ముందే పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. తన పరిస్థితిని వివరిస్తూ వీడియో రిలీజ్ చేసిన రెండు రోజులకు హత్యకు గురయ్యాడు.రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు ఎస్పీ మీద తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.తమిళనాడు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాలకు మధ్యలో చిత్తూరు జిల్లా ఉండడంతో దొంగతనాలు, గంజాయి రవాణా, చైన్ స్నాచింగులు విపరీతంగా జరిగాయి. పూతలపట్టులో చైన్ స్నాచర్స్‌తో పోరాడి ఓ మహిళ మరణించింది.

పోలీసుల్ని ఇబ్బంది పెట్టి.. : వైసీపీ హయాం నాటి పోలీసు అధికారులు అదే స్థానాల్లో పనిచేస్తున్నారని పుంగనూరులో టీడీపీ కార్యకర్త హత్య జరిగిన సమయంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చెప్పారు. దీంతో జిల్లాలో ఏకంగా 280 మంది పోలీసుల్ని రాత్రికి రాత్రి దూర ప్రాంతాలకు బదిలీ చేశారు. సాధారణంగా బదిలీల విషయం ముందే చెప్పి, కౌన్సిలింగ్ నిర్వహించి మరీ బదిలీలు చేపట్టాల్సి ఉంటుంది. ఎస్పీ ఏకపక్ష నిర్ణయంతో 280 పోలీసు కుటుంబాలు ఇబ్బందులు పడ్డాయి.అలాగే కొందరు అవినీతి అధికారులకు మంచి పోస్టింగులు ఇచ్చి వారితో సఖ్యతగా ఉంటారని పోలీసుశాఖలోనే చర్చ నడిచింది. జిల్లాలో తనకంటూ ఓ వర్గాన్ని ఏర్పాటుచేసుకుని, వారిని ప్రోత్సహించి స్థానిక ప్రజాప్రతినిధులకు విలువ లేకుండా చేశారన్న ఆరోపణ ఉంది. గతంలో చిత్తూరులో చేసిన ఓ సీఐ మీద తీవ్రమైన అవినీతి ఆరోపణలు వస్తే నెల రోజులు వీఆర్‌లో పెట్టి ఆ తర్వాత పుంగనూరు నియోజకవర్గంలో కీలక సర్కిల్‌ను అప్పగించారన్న విమర్శలను మణికంఠ ఎదుర్కొన్నారు. ప్రస్తుతం చిత్తూరులో కీలక సీఐ మీద కూడా అవినీతి ఆరోపణలు వస్తే విచారణ పేరుతో కాలం వెల్లదీస్తున్నారన్న విమర్శలనూ ఎదుర్కొంటున్నారు.

జగన్‌ను అడ్డుకోవడంతో విఫలం : మామిడి రైతులకు మద్దతు పేరుతో మాజీ సీఎం జగన్ బంగారుపాళ్యంలో పర్యటించినప్పుడు పోలీసుల వైఫల్యం బయటపడింది. ముందుగా అనుకున్న రూట్‌లో కాకుండా జగన్ మరో దారిలో ప్రయాణించారు. దీంతో వైసీపీ నేతలు మామిడి కాయల్ని ఐదు ట్రాక్టర్లలో తెచ్చి జగన్ కాన్వాయ్ ఎదుట పోసి నిరసన తెలిపారు. ప్రజాప్రతినిధులతో సమన్వయ లోపం కూడా చాలాసార్లు బయటపడింది.ఫలానా అధికారి వైసీపీ హయాం నుంచీ పనిచేస్తున్నారని, బదిలీ చేసి వేరే వాళ్లని వేయమని ఎమ్మెల్యేలు కోరితే కావాలనే వారిని అక్కడే పెట్టి ఎమ్మెల్యేలకు పంటి కింద రాయిలా మార్చేవారు. దీంతో ఎమ్మెల్సీ శ్రీకాంత్ సహా పలువురు ఎమ్మెల్యేలు సీఎం చంద్రబాబుకు పలుమార్లు ఫిర్యాదు చేశారు.

మహిళాభివృద్ధికి మైలురాయి



లోక్‌సభ స్పీకరు ఓం బిర్లాకు ఏపీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ స్వాగతం

తిరుపతి వేదికగా నేడు, రేపు జాతీయ మహిళా సాధికార సదస్సు

తిరుపతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలకు ఎన్నింటికో వేదికగా నిలిచిన తిరుపతి తాజాగా కీలకమైన తొలి జాతీయ మహిళా సాధికార సదస్సుకు వేదికగా మారుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించే క్రమంలో మహిళాభివృద్ధికి దోహదం చేసే అంశాలపై ఈ సదస్సులో చర్చించి కీలక తీర్మానాలు చేయనున్నారు. తిరుపతి వేదికగా నేటి నుంచీ రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సుకు లోక్‌సభ స్పీకరు, రాజ్యసభ ఉపాధ్యక్షుడు, ఏపీ సీఎం, గవర్నర్, అసెంబ్లీ స్పీకరు, మండలి ఛైర్మన్, పలువురు మంత్రులు సహా పలువురు ప్రముఖులు హాజరవుతున్నారు. అలాగే దేశవ్యాప్తంగా పార్లమెంటు, శాసనసభల మహిళా కమిటీల సభ్యులు సదస్సుకు తరలివస్తున్నారు. దీంతో జిల్లా యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అంతేస్థాయిలో ఏర్పాట్లు చేపట్టింది.200 మందికి పైగా ప్రతినిధులు హాజరవుతున్న కారణంగా వారందరికీ విడివిడిగా బస, వాహన సదుపాయాలు ఏర్పాటు చేసింది. ప్రతి ప్రతినిధికీ వెంట వుండి అవసరమైన వసతులు, సౌకర్యాలూ కల్పించేందుకు లైజన్ ఆఫీసర్లను నియమించింది. వారిపై పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లను నియమించింది. సదస్సుకు వేదికగా తిరుచానూరు బైపాస్ రోడ్డులోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌ను ఎంపిక చేసి ఏర్పాట్లు పూర్తి చేసింది.తిరుపతిలో రెండు రోజుల సదస్సు కారణంగా అటు ప్రముఖుల రాకపోకలు, ఇటు భద్రతా ఏర్పాట్లతో నగరంలో హడావిడి బాగా పెరిగింది.

లోక్ అదాలత్‌లో 5,345 కేసుల పరిష్కారం



కక్షిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జిల్లా జడ్జి అరుణ సారిక

చిత్తూరు లీగల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా జడ్జి అరుణ సారిక తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రజలు విభేదాలను పక్కనపెట్టి ఐకమత్యంగా ఉండాలన్నారు. క్షణికావేశానికి గురై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదన్నారు. మూడునెలలకోసారి జరిగే ఈ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జరిగిన లోక్ అదాలత్ ద్వారా 5,345 కేసులు పరిష్కారమయ్యాయి. ప్రాంతాల వారీగా.. వాయల్పాడులో 82, తిరుపతిలో 1,450, తంబళ్లపల్లెలో 150, శ్రీకాళహస్తిలో 237, సత్యవేడులో 285, పుత్తూరులో 200, పుంగనూరులో 126, పీలేరులో 76, పలమనేరులో 189, పాకాలలో 94, నగరిలో 91, మదనపల్లెలో 695, కుప్పంలో 79, చిత్తూరులో 1,561 కేసులు పరిష్కారమయ్యాయి.

చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో జూడాలపై విద్యార్థుల దాడి



జూడాలను విచారిస్తున్న పోలీసులు

పగిలిన డాక్టర్ ముక్కు
ఆపై మహిళా వైద్యులతో అసభ్యకర ప్రవర్తన

● నిందితులను అరెస్టు చేయాలని విధులు బహిష్కరించి డాక్టర్ల ధర్నా
● పోలీసుల హామీతో విరమణ

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో విధుల్లో ఉన్న జూనియర్ డాక్టర్ల (జూడాల)పై నగరంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలని శనివారం ఉదయం ఆస్పత్రిలోని జూడాలు విధులు బహిష్కరించి, ధర్నాకు దిగారు. పోలీసుల హామీతో విరమించారు.

ఏం జరిగిందంటే..

శుక్రవారం అర్ధరాత్రి దాటాక కొందరు విద్యార్థులు మద్యం మత్తులో తమ స్నేహితుడి చేయికి దెబ్బ తగిలిందని చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలోని అత్యవసర విభాగానికి గుంపుగా వచ్చారు. డ్యూటీలోని వైద్యుడు పరిశీలించి స్కానింగ్ చేయించాలని చెప్పాడు. స్కానింగ్ కేంద్రం వద్దకెళ్లినవారు అక్కడ డ్యూటీలో ఉన్న రేడియాలజిస్ట్ డాక్టర్‌తో అసభ్యకరంగా ప్రవర్తించారు. ఆమె సెల్‌ఫోన్‌తో వీడియో తీయడం మొదలుపెట్టింది. ఆగ్రహించిన విద్యార్థులు ఆమెను నెట్టి.. 'ఏం చేసుకుంటావో చేసుకో..బయటకు వస్తావు కదా.. నీకథ చూస్తాం' అని వార్నింగ్ ఇచ్చారు. తర్వాత అక్కడున్న సిబ్బంది దెబ్బతిన్న విద్యార్థికి స్కానింగ్ తీసి, క్యాజువాలిటీకి వెళ్లాలని సూచించారు. రిపోర్టు తీసుకుని తిరిగి గుంపుగా క్యాజువాలిటీకి వచ్చిన విద్యార్థులు వైద్యులపై కామెంట్లు చేస్తూ.. అరుస్తూ... గొడవ చేశారు. దెబ్బతగిలిన వ్యక్తి వద్ద ఒక్కరుండి మిగిలినవారు బయట వేచి ఉండాలని అక్కడున్న వైద్యుడు సూచించారు. మమ్మల్నే బయట ఉండాలంటావా? అంటూ ఆ వైద్యుడిపై దాడి చేయడంతో ముక్కు పగిలింది. తర్వాత డ్యూటీలోని మరో ఇద్దరు డాక్టర్లపైనా సుమారు 15 మంది విద్యార్థులు మూకుమ్మడి దాడికి పాల్పడి గాయపరిచారు. ఈ ఘటనతో చికిత్స పొందుతున్న రోగులు భయాందోళనతో పరుగులు తీశారు.

చర్యలు తీసుకోవాలని ధర్నా



నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

వైద్యులపై దాడికి పాల్పడిన వారందరిపైనా చర్యలు తీసుకోవాలని విధులు శనివారం ఉదయం విధులు బహిష్కరించి 300 మందికిపైగా జూడోలు ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. పోలీసులొచ్చి సర్దిచెప్పారు. దాడికి పాల్పడిన వారందరిపై కేసు నమోదు చేస్తామని టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

అవుట్ పోస్ట్, ఆస్పత్రి సెక్యూరిటీ వైఫల్యం

క్యాజువాలిటీలో అరుపులు, కేకలతో దద్దరిల్లుతుంటే.. క్యాజువాలిటీకి ఆనుకుని ఉన్న అవుట్ పోస్ట్‌లో సిబ్బందికి తెలియక పోవడం గమనార్హం. గతంలోనూ బయట గొడవపడి చికిత్స పొందుతున్న బాధితులపై క్యాజువాలిటీలోనే కత్తులతో దాడికి పాల్పడ్డారు. అప్పుడు కూడా అవుట్‌పోస్ట్‌లో పోలీసులు ఇలాగే ప్రవర్తించారని వైద్యులు గుర్తు చేశారు. ఉన్న ఒకరిద్దరు పోలీసులు రిటైర్‌మెంట్‌కు దగ్గర ఉన్నవారే కావడంతో ఉపయోగం లేదని ఆస్పత్రి సిబ్బందే చెబుతున్నారు.

నేటినుంచి ఆస్పత్రి వద్ద ఇద్దరు ఏఆర్ పోలీసులు

ఈ ఘటనపై ఎస్పీ మణికంఠ ఆరా తీసినట్లు సమాచారం. వైద్యుల భద్రత కోసం ఆదివారం నుంచే ఇద్దరు ఏఆర్ పోలీసులకు 24 గంటలపాటు ఆస్పత్రి వద్ద డ్యూటీ వేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



రేడియాలజిస్ట్‌తో అసభ్యకరంగా మాట్లాడుతున్న విద్యార్థి

ఆరుగురిపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): బాధిత జూడాలు ఇచ్చిన ఫిర్యాదుతో రెండో పట్టణ పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. శనివారం రాత్రి 12.30గంటలకు బజారువీధికి చెందిన మొగిలీశ్వరన్ చేతికి గాయం కావడంతో అతడి స్నేహితులైన షరీఫ్, లోకేష్, యశ్వంత్, వినేష్, సందీప్‌తో కలిసి చికిత్స చేసుకోవడానికి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. చికిత్స చేయించుకునే క్రమంలో వైద్యులు రక్షిత్, సరన్, యోగేష్‌లతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో డాక్టర్ రక్షిత్ పై మొగిలీశ్వరన్ దాడి చేశాడు. అనంతరం డాక్టర్లు మనోజ్‌కుమార్, మోహన్‌లు గాయపడిన డాక్టర్ రక్షిత్‌తో కలిసి అత్యవసర విభాగం గది ముందు మాట్లాడుకుంటుండగా.. మళ్లీ ఆరుగురు కలిసి వారిపై దాడిచేసి గాయపరిచారు. ఈ ఘటనపై డాక్టర్ మనోజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

అదేసమయంలో ఆస్పత్రిలోని సెక్యూరిటీ పూర్తిగా విఫలమైంది. దాడి జరిగిన తర్వాత రావడంపై పలు విమర్శలొస్తున్నాయి.

బయట రక్షణ మాటేంటి: మహిళా జూడాలు

క్యాజువాలిటీలో 15 మంది వచ్చి డాక్టర్లను కొట్టి మళ్లీ బయటకొస్తే మీ అంతు చూస్తామని బెదిరించి వెళ్లారు. బయట మా రక్షణ మాటేంటని టూసీఐని మహిళా జూడాలు ప్రశ్నించారు. గతంలోనూ ఇలాంటి ఘటన జరిగితే పోలీసులు దాడి చేసిన వారిని తీసుకెళ్లిపోయారు. వాళ్లు మరుసటి రోజే ఆస్పత్రిలో కనిపించారని ఆవేదన వ్యక్తం చేశారు. దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని కోరారు. అలాగే దాడికి పాల్పడినవారంతా గంజాయి తీసుకున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు.



ఓంబిర్లాతో మాట్లాడుతున్న రఘురామ కృష్ణమరాజు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమలలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శనివారం తిరుమలకు చేరుకున్నారు. శ్రీకృష్ణ అతిథిగృహం వద్ద టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. ఆదివారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కొద్దిసేపు లోక్‌సభ స్పీకర్‌తో ముచ్చటించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



తిరుమలేశుడిని భక్తులు ప్రశాంతంగా దర్శిస్తున్నారు

● మంత్రి సవిత

తిరుమల, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తులు ఎంతో ప్రశాంతంగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్నారని మంత్రి సవిత అన్నారు. తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం ఆమె దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ తిరుమలలో అందిస్తున్న అన్నప్రసాదాలు, వసతి, దర్శనాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు శ్రీవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించినట్టు చెప్పారు.


సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణ తేజ విశ్రాంతి భవనం మీదుగా శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.4.18 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 69,482

తలనీలాలు సమర్పించినవారు: 28,234





జిల్లా సహకార కేంద్ర బ్యాంకు

డీసీసీబీలో ప్రక్షాళన

- గత పాలకవర్గం హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలు
- 11మంది ఉద్యోగుల సస్పెన్షన్.... 30మందిపై శాఖాపరమైన చర్యలు
- ముగ్గురు సర్వీసు నుంచి తొలగింపు.. నలుగురు రిటైర్డు ఉద్యోగులపైనా చర్యలు



మాజీ సీఈవో మనోహర గౌడ్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో గాడితప్పిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో ప్రక్షాళన మొదలైంది.అప్పట్లో పాలకవర్గం నిబంధనలకు పాతరేయడంతో డీసీసీబీ అక్రమాలకు కేంద్రంగా మారింది. ఆర్థిక అవకతవకలపై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక డీఆర్వో నేతృత్వంలో జరిగిన విచారణలో అప్పటి పాలకవర్గం సహకార రంగానికి చేసిన అపకారం తేటతెల్లమైంది.ఇందుకు బాధ్యులుగా భావించి తొలివిడతగా 48మంది బ్యాంకు ఉద్యోగులపై వేటు పడింది.అక్రమాలకు బాధ్యులైన పాలకవర్గ సభ్యులపై మలివిడతలో చర్యలు తీసుకోనున్నారు.

రూ. 75కోట్లకు మించి ఆర్థిక అవినీతి

వైసీపీ హయాంలో డీసీసీబీకి ఎన్నికలు నిర్వహించకుండానే పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీలతో కథ నడిపించారు. నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులతో సెవెన్‌మెన్ కమిటీ డీసీసీబీలో అధికారాలను వెలగబెట్టింది.ఐదేళ్లపాటు బ్యాంకు చైర్‌పర్సన్‌గా రెడ్డెమ్మ కొనసాగారు.ఆమెతోపాటు డైరక్టర్లు, బ్యాంకు ఉద్యోగులు, వైసీపీ నేతలు కలసిపోయి పెద్దఎత్తున అవినీతి అక్రమాలకు తెరతీశారు.ఉద్యోగ నియామకాల్లో డబ్బులు వసూలు చేయడం,అవసరం వున్నా లేకపోయినా వాహనాల కొనుగోళ్లు జరపడం, భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడం,బినామీ పేర్లతో కోట్లాది రూపాయలను రుణాలుగా తీసుకుని చెల్లించక పోవడం వీటిలో కొన్ని. దాదాపు రూ.75 కోట్లకు పైగా డీసీసీబీలో అవినీతి అక్రమాలు జరిగాయని అంచనా.ఈ విషయాలపై ఆంధ్రజ్యోతి అప్పట్లోనే పలు కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే.ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఈ వ్యవహారంపై డీఆర్వో మోహన్‌కుమార్‌తో విచారణ జరిపించారు. సహకార చట్టం 51వ సెక్షన్ ప్రకారం జరిగిన విచారణలో అక్రమాల గుట్టును తేల్చారు. ఈ అవినీతి పర్వంపై తదుపరి విచారణకు జిల్లా సహకార బ్యాంకు ప్రత్యేక సర్వసభ్య సమావేశం శుక్రవారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.ఈ నేపథ్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు డీసీసీ బ్యాంకు అధికారులకు తగుచర్యలు వెంటనే చేపట్టాలని శనివారం డీసీవో లక్ష్మి సూచించారు. దీంతో బ్యాంకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. శనివారం సెలవు రోజైనా బాధ్యులందరిపై చర్యలు తీసుకుంటూ నోటీసులు జారీ చేశారు.అక్రమాలకు బాధ్యులైన పాలకవర్గ సభ్యులపై, వైసీపీ ముఖ్యులపై త్వరలో చర్యలు తీసుకోనున్నారు.

మరో ఏడుగురిపైనా చర్యలు

డీసీసీబీ వ్యవహారాల్లో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణల కారణంగా మరో ఏడుగురిపై చర్యలు చేపట్టారు. ఉద్యోగ నియామకాల్లో జరిగిన అక్రమాలపై బాధితులు ఫిర్యాదు చేసినా గత పాలకవర్గం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.నిబంధనలకు విరుద్ధంగా పర్మినెంట్ అయిన డి. జయప్రకాష్ (స్టాఫ్ అసిస్టెంట్), టి. శ్రీలక్ష్మీప్రసన్న (మేనేజర్), బి. గురునాథం (స్టాఫ్ అసిస్టెంట్)లను తొలగిస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. బ్యాంకులో గత పాలకవర్గానికి మద్దతుగా తప్పుడు చర్యలకు పాల్పడిన రిటైర్డ్ అధికారులు ఎస్. ఆషాబీ (ఏజీఎం), వై. యోగీశ్వర్ రెడ్డి (ఏజీఎం), కె. కిరణ్‌కుమార్ రెడ్డి (డీజీఎం), సి. సుబ్రహ్మణ్యం (మేనేజర్)లకు నోటీసులు జారీచేశారు.

ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది దాకా....

డీసీసీ బ్యాంకు అవకతవకలకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది దాకా 30మందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ శనివారం రాత్రి వారందరికీ నోటీసులు జారీచేశారు. మరో 11 మందిపై సస్పెన్షన్ వేటు వేశారు.అప్పటి బ్యాంకు సీఈవో, ప్రస్తుతం జీఎంగా వ్యవహరిస్తున్న ఇ. మనోహర్ గౌడ్, ఏజీఎం టి. చంద్రకళ, చీఫ్ మేనేజర్లు జె. సందీప్, కె. నవీన్ కుమార్, కె. త్యాగరాజు, మేనేజర్లు కె. వెంకటేష్ బాబు, ఆర్. పుష్పలత, ఎం. రమేష్, వి. మోహన్‌కుమార్, అసిస్టెంట్ పి. లక్ష్మారెడ్డి, స్టాఫ్ అసిస్టెంట్ మహమ్మద్ యాసీన్ సస్పెండైన వారిలో వున్నారు.

అమ్మవారి సేవలో కేంద్ర ఆర్థిక మంత్రి



నిర్మలా సీతారామన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న బీజేపీ నేతలు

తిరుచానూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతీ అమ్మవారిని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద జేఈవో వీరబ్రహ్మం, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి, తర్వాత సన్నిధిలోని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల బీజేపీ నేతలు ఆమెకు రాములవారి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు. సాయంత్రం హైకోర్టు అడ్వకేట్ జనరల్ దొమ్మలపాటి శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వరుస సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచేగాక పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. 30వేల మంది దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 426, రూ.200 శీఘ్ర దర్శనం 3,581మంది, రూ.50ప్రత్యేక దర్శనం 2,611మంది దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,077మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,349, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 337మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 212మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 93మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 25.360 అమ్ముడైనట్లు ఆలయాధికారులు తెలిపారు.



ఒక్కటైన సుబ్రమణ్యం, రంజిత దంపతులు





ఒక్కటైన చంద్రశేఖర్, పల్లవి దంపతులు - ఒక్కటైన వెంకటేష్, రాసాతి దంపతులు

లోక్ అదాలత్‌లో ఒక్కటైన మూడు జంటలు

పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజ మార్గమని సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర పేర్కొన్నారు. శనివారం పుత్తూరు కోర్టులో జరిగిన లోక్ అదాలత్‌లో 214 కేసులు పరిష్కరించారు. ఇందులో ముఖ్యంగా మూడు జంటలు ఒక్కటయ్యాయి. న్యాయమూర్తి రాఘవేంద్ర వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ఒక్కటి చేశారు. న్యాయవాదుల సంఘం కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

- నారాయణవనం మండలం కొండల చెరువు గ్రామానికి చెందిన బలరామ్ తన భార్య రంజితను కాపురానికి ఆహ్వానిస్తూ 2024లో కోర్టును ఆశ్రయించాడు. లోక్ అదాలత్‌లో రంజిత భర్తతో జీవించేందుకు అంగీకరించింది. సహకరించిన న్యాయవాదులకు మురగేషన్ రెడ్డి, రాజారెడ్డిలను అభినందించారు.
- నెల్లూరు జిల్లా కావలికి చెందిన చంద్రశేఖర్‌కు నారాయణవనానికి చెందిన పల్లవితో వివాహమైంది. దంపతుల మధ్య మనస్పర్థలు ఏర్పడి పల్లవి పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో చంద్రశేఖర్ విడాకుల కోసం పుత్తూరు కోర్టులో ఈ ఏడాది కేసు దాఖలు చేశారు. లోక్ అదాలత్‌లో వీరి మధ్య రాజీ కుదిర్చారు. న్యాయవాదులు గాలి సురేష్, లక్ష్మీ నారాయణలను జడ్జి అభినందించారు.
- నందిమంగళానికి చెందిన వెంకటేష్‌కు కార్వేటినగరానికి చెందిన రాసాతి దంపతులకు ఇద్దరు పిల్లలు. వరకట్నం కోసం వేధిస్తున్నారని రాసాతి ఆరేళ్ల క్రితం కేసు దాఖలు చేసింది. ఈ కేసును అదనపు జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జానకి విచారణ చేశారు. కౌన్సెలింగ్ ద్వారా ఈ దంపతులను ఒక్కటి చేశారు. సహకరించిన న్యాయవాది రాజేష్‌ను న్యాయమూర్తులు అభినందించారు.

రేపు జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 15న నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఎస్వీయూ స్టేడియం వేదికగా జరుగనున్న ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 20 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలని, బాలుర బరువు 75కిలోల లోపు, బాలికల బరువు 65కిలోల లోపు ఉండాలని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9440078979, 7993014997, 7032467395లను సంప్రదించాలని కోరారు.

ఎస్పీగా సుబ్బరాయుడు

● ప్రకాశం జిల్లాకు హర్షవర్ధనరాజు



సుబ్బరాయుడు



హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా సుబ్బరాయుడిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఎస్పీగా పనిచేస్తున్న హర్షవర్ధనరాజును ప్రకాశం జిల్లాకు బదిలీ చేసింది. సుబ్బరాయుడు ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. గత ఏడాది మే 14న జిల్లా ఎస్పీగా హర్షవర్ధ రాజు బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఘర్షణలు, విద్వేషాలు చోటుచేసుకోకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కడప జిల్లాలో నెలకొన్న ఘటనలు, శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని ఆయన్ను అక్కడికి బదిలీ చేసింది. తెలంగాణా క్యాడర్‌లో ఉన్న సుబ్బరాయుడిని ఏపీకి రప్పించి తిరుపతి జిల్లాకు ఎస్పీగా నియమించింది. ఆయన గత ఏడాది జూలై 15న బాధ్యతలు స్వీకరించారు. దాదాపు ఆరు నెలలు విధులు నిర్వహించారు. ఈ ఏడాది జనవరిలో వైకుంఠ ఏకాదశి దర్శన టికెట్ల జారీ ప్రక్రియలో తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటన నేపథ్యంలో ఆయన్ను ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జిగా బదిలీ చేసింది. తొక్కిసలాట ఘటనపై విచారణ జరిపిన ఏకసభ్య కమిషన్ క్లీన్ చిట్ ఇవ్వడంతో ఆయన్ను జిల్లా ఎస్పీగా ప్రభుత్వం నియమించింది. ఇలా తిరుపతి జిల్లాకు రెండుసార్లు ఎస్పీగా పనిచేసే అవకాశం వారిద్దరికీ దక్కింది.

గంజాయిపై ఉక్కుపాదం

జిల్లాలో పనిచేసిన ఆరు నెలల కాలంలో గంజాయి అక్రమ రవాణాపై సుబ్బరాయుడు ఉక్కుపాదం మోపారు. ఎర్రావారిపాళెంలో బాలికపై అత్యాచారం ఘటనలో 24 గంటలు తిరక్క ముందే నిందితుడిని అరెస్టు చేయించారు. మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా రక్షక్ టీమ్‌లు ఏర్పాటు చేసి విద్యా సంస్థల్లో అవగాహన కల్పించారు.

టెక్ పోలీసుకు ప్రాధాన్యం

జిల్లా పోలీసు శాఖలో టెక్నాలజీకి హర్షవర్ధనరాజు ప్రాధాన్యత ఇచ్చారు. నేరాల కట్టడిలో డ్రోన్లు వినియోగించి సఫలీకృతులయ్యారు. ఆటోలకు డిజిటల్ స్టిక్కర్లు ఏర్పాటు చేయించారు. ట్రాఫిక్ నియంత్రణలో డ్రోన్లు వినియోగించి విజయవంతమయ్యారు. తిరుపతి, జీవకోన, మంగళంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రౌడీలపై ఉక్కుపాదం మోపారు. జీవకోనలో అవుట్ పోస్టు పోలీసు స్టేషన్ ఏర్పాటు చేశారు. అన్ని కూడళ్లలో ట్రాఫిక్ అవుట్ పోస్టులు ఏర్పాటు చేసి, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు.

తిరుమలలో ప్రతి అంగుళాన్ని మానిటర్ చేయాలి

● అధికారులను ఆదేశించిన ఈవో అనిల్‌కుమార్ సింఘాల్



తిరుమల, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పలు ప్రాంతాల్లో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాల పనితీరును వీడియోవాల్ ద్వారా వీక్షించారు. తిరుమలలోని ప్రతి అంగుళాన్ని మానిటర్ చేయగల విధంగా సిబ్బందిని నియమించి కమాండ్ కంట్రోల్ సెంటర్ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. ఎల్ అండ్ టీ సిబ్బందితో కూడా ఈవో టెక్నాలజీ వినియోగంపై చర్చించారు. అనంతరం పీఏసీలోని లగేజీ కౌంటర్‌ను పరిశీలించి కొందరు భక్తులతో మాట్లాడారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్2కు చేరుకుని భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం, మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతాలకు చెందిన శ్రీవారి సేవకులతో మాట్లాడారు. శ్రీవారి సేవకులకు మరింత నాణ్యమైన శిక్షణ ఇచ్చి తద్వారా భక్తులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సీపీఆర్వో రవికి సూచించారు. ఈ తనిఖీల్లో ఈవోతో పాటు సీవీఎస్వో మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, వీఎస్వోలు రామ్‌కుమార్, సురేంద్ర, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్ పాల్గొన్నారు.

పరిశ్రమల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

● పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి యువరాజ్



వర్చువల్‌గా మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్ - హాజరైన పారిశ్రామికవేత్తలు



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీపడాలంటే ఉత్పత్తులు తయారుచేయడమే కాకుండా పరిశ్రమలు నైతిక విలువలు పాటించాలని, నాణ్యతా ప్రమాణాలను నిలబెట్టుకోవాలని పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్ అన్నారు. శనివారం ఉదయం స్థానిక కెన్సెస్ హోటల్లో ఏర్పాటుచేసిన సులభతర వాణిజ్య అవగాహన ప్రాంతీయ సదస్సుకు పరిశ్రమల శాఖ జీఎం చంద్రశేఖర్, కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరుకాగా వర్చువల్‌గా యువరాజ్ పరిశ్రమల యజమానులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు, ప్రభుత్వం కలసి ముందుకు వెళితేనే ప్రపంచ స్థాయిలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ముందు వరుసలో ఉంటామని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో రాష్ట్రం సింగిల్ విండో సిస్టమ్, మీ సేవా కేంద్రాలు, గ్యారెంటీ యాక్ట్ వంటి కార్యాచరణ చేపట్టిందన్నారు. చిన్నస్థాయి వ్యాపారాలు ఏ అనుమతి లేకుండా వెంటనే ప్రారంభించేలా జాబితా తయారు చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలకు సంబంధించిన ప్రతినిధుల సమస్యలు, అభ్యర్థనలు సేకరించి ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. తిరుపతి-నాయుడుపేట జాతీయ రహదారి, గూడూరు-రేణిగుంట రైల్వే ట్రిప్లింగ్, కృష్ణపట్నం పోర్టులు, తిరుపతి ఎయిర్‌పోర్ట్ లభ్యతతో ఈ ప్రాంత తూర్పుతీరంలో పెట్టుబడులకు అత్యంత అనుకూలంగా ఉందన్నారు. వచ్చే 10-15 ఏళ్లలో త్రిభుజ ప్రాంతం(నెల్లూరు-తిరుపతి-చెన్నై)అగ్రశ్రేణి పారిశ్రామిక కేంద్రంగా అవతరించనుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జెడ్ఎం విజయ్‌భరత్‌రెడ్డి, పరిశ్రమశాఖ డీడీ మురళి పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలే ఆవిష్కరణలకు పెట్టుబడి

● డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి



విద్యార్థులతో డాక్టర్ సతీష్‌రెడ్డి

తిరుపతి రూరల్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): సరికొత్త ఆలోచనలే గొప్ప ఆవిష్కరణలకు పెట్టుబడిగా నిలుస్తాయని డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు వైవిధ్య ఆలోచనలతో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కరకంబాడీరోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులకు ఇన్‌స్పైరింగ్ మైండ్స్ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. మనదేశంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ఇంక్యుబేషన్ కేంద్రాలు అందుబాటులో రావడంతో పరిశోధకులసంఖ్య బాగా పెరిగిందన్నారు. ఏపీలో టాటాసంస్థతో కలసి ఇంక్యుబేషన్ రీసెర్చ్ కేంద్రాల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు సారథ్యంలో కృషి జరుగుతోందన్నారు. రక్షణ రంగంలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన ఆయుధాలను ఎగుమతిచేస్తున్నామన్నారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవిందకుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వాసు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు పర్యటన ఇలా...

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆదివారం తిరుపతికి రానున్నారు. ఉదయం 9 గంటలకు తిరుచానూరు సమీపంలోని తాజ్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన డీబీఆర్ ఆస్పత్రి రోడ్డులోని శ్రీకన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని విట్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు విశ్వనాథం మనవరాలు కాదంబరి వివాహానికి హాజరవుతారు.10 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి తిరుచానూరు వద్ద రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే మహిళా సాధికారత సదస్సులో పాల్గొంటారు.అనంతరం ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ డెలిగేట్స్ ఏర్పాటు చేసిన ప్రదర్శనను సందర్శించి, గ్రూప్ ఫొటో దిగుతారు. 10.30 నుంచి ఒంటి గంట వరకు జాతీయ మహిళా సాధికారత కాన్ఫరెన్సులో పాల్గొంటారు. డెలిగేట్స్‌కు మధ్యాహ్నం అతిథ్యం ఇవ్వనున్నారు. 2.05 గంటలకు హెలికాప్టర్‌లో విజయవాడకు బయలుదేరి వెళతారు.



అంగన్‌వాడీ సిబ్బందికి బాలికను అప్పగిస్తున్న గ్రామస్తులు

గ్రామస్తుల ఔదార్యం

● మతిస్థిమితం లేని బాలికకు ఆసరాగా నిలిచి..

పాకాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని బాలికను గ్రామస్తులు అక్కున చేర్చుకున్నారు. అంగన్‌వాడీ సిబ్బందికి అప్పగించారు. కుందేటివారిపల్లె సమీపంలోని సామిరెడ్డిపల్లె చెత్తసంపద తయారీ కేంద్రం పరిసరాలలో శనివారం సాయంత్రం 15ఏళ్ల మతిస్థిమితం లేని బాలిక అటూ ఇటూ తిరుగుతోంది. అక్కడికి సమీపంలో వ్యవసాయ పనులు చేస్తున్న కుందేటిపల్లెకు చెందిన చెంగల్రాయనాయుడు గమనించాడు. బండిపై కొంతదూరం తీసుకువచ్చాక ఎక్కడికి వెళ్లాలో చెప్పకపోవడంతో మళ్లీ బాలికను అక్కడే వదిలేశాడు. గ్రామంలో సోంపల్లి ఉమాపతినాయుడు, పాల చిన్న, రామచంద్రయాదవ్‌లకు ఈ విషయం చెప్పాడు. దీంతో నలుగురూ కలిసి వెళ్లి చూస్తే బాలిక ఏడుస్తూ కనిపించింది. డాడీ ఇక్కడ వదిలాడని.. అమ్మ డ్వాక్రా డబ్బులు కట్టడానికి వెళ్లిందని పొంతన లేని మాటలు చెబుతోంది. దీంతో వారు గ్రామానికి తీసుకువచ్చారు. ఓదార్చి భోజనం పెట్టారు. సముదాయించి వివరాలు అడగడంతో పేరు చిన్నా అని, తండ్రి రామచంద్ర నాయుడు, తల్లి నాగమణి అని, ఊరు చంద్రగిరి అని చెబుతోంది. పోలీసుల సూచన మేరకు వారు ఐసీడీఎస్‌కు చెందిన సుజాతకు విషయం చెప్పారు. బాలికను రేణిగుంట అభయక్షేత్రానికి అప్పగించాలని ఆమె సలహా ఇచ్చి ఊరుకుంది. దీంతో గ్రామస్తులు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్న తరుణంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కిరణ్మయి స్పందించింది. జయదేవపురం అంగన్‌వాడీ సిబ్బందిని కుందేటివారిపల్లెకు పంపింది. వారు బాలికను సంరక్షణకు తీసుకెళ్లారు.

ఆర్టీఎఫ్ చెల్లించకుంటే కళాశాలలు మూసేసి నిరసన

ఏపీపీడీసీఎంఏ



సమావేశంలో పాల్గొన్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లోని రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీజు (ఆర్టీఎఫ్) చెల్లించకుంటే కళాశాలలు మూసేసి నిరసన తెలుపుతామని ఏపీ ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం (ఏపీపీడీసీఎంఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ఎస్వీయూ సంఘం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు హేమచంద్రనాయుడు తెలిపారు. శనివారం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు కళాశాలలో ఈ అంశంపై యాజమాన్యాలతో జరిగిన సమావేశంలో వారు ప్రసంగించారు. రెండేళ్లుగా పెండింగ్‌లోని ఆర్టీఎఫ్ ప్రభుత్వం చెల్లించకపోవడంతో కళాశాలలు మూసివేసే దశకు చేరుకున్నాయన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అప్పులు చేస్తూ రెండేళ్లుగా నెట్టుకొచ్చామని చెప్పారు. ఈనెల 20వ తేదీలోపు ఆర్టీఎఫ్ చెల్లించకుంటే రాష్ట్ర నాయకత్వం పిలుపుథక్ష కలెక్టర్, ఆర్డీవోలు, యూనివర్సిటీ వీసీలకు వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. 22వ తేదీనుంచి రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలలు మూసేసి నిరవధిక నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో స్టేట్ ఈసీ మెంబర్లు గోపినాథన్, శ్రీధర్, కళాశాలల యాజమాన్య సంఘం ప్రతినిధులు లోకేష్, వాసు, మునినారాయణ, రమేష్, వేదవ్యాస్, శ్రీనివాసులు రెడ్డి, బాలాజి పాల్గొన్నారు.





పుష్పపల్లకిలో వరసిద్ధుడు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో శనివారం రాత్రి స్వామివారు పుష్పపల్లకిలో విహరిస్తూ భక్త జనులకు దర్శనమిచ్చారు.భాగ్యలక్ష్మి, దివంగత మోహన్‌నాయుడు,వీటీ రాజన్ అండ్ బ్రదర్స్, రామనాథ నాయుడు,రాజారెడ్డి జ్ఞాపకార్థం,కృష్ణమ నాయుడి జ్ఞాపకార్థం వారి కుమారులు, నరసింహారెడ్డి అండ్ సన్స్, రాజారెడ్డి అండ్ కో, కీర్తిశేషులు శ్రీరాములరెడ్డి, బాలకృష్ణారెడ్డి, శేషయ్య నాయుడు అండ్ సన్స్, కుమరేంద్రచౌదరి, మనోహర నాయుడు అండ్ బ్రదర్స్, అంజనేయులు నాయుడు అండ్ సన్స్ ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం మూలవిరాట్‌కు ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించి చందనాలంకారంతో భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకురాగానే అలంకార మండపంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామివారి ఉత్సవమూర్తులను సంప్రదాయ బద్ధంగా తీసుకొచ్చి కదిలే పుష్పవనంలా తయారుచేసిన పల్లకిపై ఆశీనులను చేశారు. మంగళ వాయిద్యాలు, భాజాభజంత్రీల నడుమ కాణిపాక పురవీధుల్లో ఊరేగించారు.ఈవో పెంచల కిషోర్, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు శ్రీధర్ బాబు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీ నాయుడు, చిట్టిబాబు, ఉభయదారులు పాల్గొన్నారు.ప్రత్యేక ఉత్సవాల్లో ఆదివారం రాత్రి కామధేను వాహన సేవను నిర్వహించనున్నారు.





డ్రైవర్స్ కాలనీ సమీపంలోని చిన్నూరు వద్ద సర్వీసు రోడ్డులో ఏనుగు కదలికలను ఆసక్తిగా చూస్తున్న జనాలు - గంటావూరు సమీపంలో

హడలెత్తించిన ఒంటరి ఏనుగు

జనావాసాల్లో పరుగులతో ప్రజలకు ముచ్చెమటలు - గజదాడిలో తీవ్రంగా గాయపడ్డ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్

గంగవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):గంగవరంలో జనావాసాల్లోకి శనివారం ఉదయాత్పూర్వమే దూసుకొచ్చిన ఒంటరి ఏనుగు గంటలకొద్దీ హడలెత్తించింది.ఓ అటవీశాఖాధికారిపై దాడిచేసి గాయపరిచింది.ఏనుగుల మంద నుంచి విడిపోయిన ఒంటరి ఏనుగు శనివారం ఉదయం 4గంటలకు గంగవరం పోలీస్‌స్టేషన్ వద్ద ప్రత్యక్షమైంది.ఏనుగు ఘీంకారాలను, శునకాల అరుపులను పోలీసులు గమనించి నైట్ రౌండ్స్‌లో ఉన్న అర్బన్ సీఐ ప్రసాద్‌కు సమాచారం అందించారు. సీఐ స్టేషన్ వద్దకు చేరుకొని టార్చ్‌లైట్ వేయగా ఒంటరి ఏనుగు రోడ్డుపై నుంచి వెళ్ళిపోయి మళ్లీ స్టేషన్ వద్దకే చేరుకొంది.దాదాపు గంటసేపు అక్కడక్కడే తిరుగుతూ రోడ్డు పక్కన జనావాసాల మధ్యకు చేరుకుంది.అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో ట్రాకర్లతో కలసి అక్కడకు చేరుకుని టపాకాయలు పేల్చుతూ ఏనుగును అడవి వైపు మళ్లించడానికి ప్రయత్నించారు.అటూఇటూ పరుగులు తీసిన ఏనుగు చుట్టూ నివాసాలుండడంతో అడవిలోకి వెళ్లలేక రోడ్డుపక్కన ఆపివున్న కారును తొండంతో ధ్వంసం చేసి డ్రైవర్స్ కాలనీవైపు వెళ్లింది. అప్పటికే గంగవరం , డ్రైవర్స్ కాలనీ, బాడీకాలని, శ్రీలంక కాలనీల ప్రజలతో పాటు వాహనదారులు పెద్దసంఖ్యలో ఏనుగును చూడడానికి అక్కడకు చేరుకోవడంతో ఉక్కిరిబిక్కిరై తిరగబడింది.పాత కీలపట్ల రోడ్డులో ముందుకెళ్తూ ఎదురుగా ఉన్న జనసందోహాన్ని గమనించిన ఏనుగు వెనుదిరిగి ట్రాకర్లు, అటవీ శాఖ అధికారులపైకి దూసుకొచ్చింది.దీంతో వారంతా ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పరుగులు తీస్తుండగా, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సుకుమార్ కాలు జారి కిందపడి ఏనుగుకు చిక్కాడు. సుకుమార్‌పై దాడికి దిగిన ఏనుగును ట్రాకర్లు పెద్దగా కేకలు వేసి తరిమివేశారు. అప్పటికే తీవ్రంగా గాయపడిన సుకుమార్‌ను హుటాహుటిన పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతిలోని నారాయణాద్రి ఆస్పత్రికి తరలించారు. కాలు, చేయికి తీవ్రంగా గాయాలయ్యాయని, ప్రాణాపాయం లేదని అధికారులు తెలిపారు. ఆయనకు ఆపరేషన్ కూడా జరిగిందని, చెప్పారు.



గజదాడిలో తీవ్రంగా గాయపడిన సుకుమార్

డ్రైవర్స్ కాలనీ, చిన్నూరు, గంటావూరు మీదుగా అడవిలోకి....

గంగవరం డ్రైవర్స్ కాలనీని ఉదయం 8.30గంటల వరకు ఏనుగు దాటకపోవడంతో అటవీ శాఖ అధికారులకు టెన్షన్ మొదలైంది.సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, పలమనేరు అటవీశాఖ అధికారి నారాయణ,పలమనేరు సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు ప్రసాద్, పార్థసారధి,రాంభూపాల్ తదితరులతోపాటు పోలీసులు, అటవీ సిబ్బంది పెద్దసంఖ్యలో డ్రైవర్స్ కాలనీ వద్దకు చేరుకుని అక్కడినుంచి వెళ్లిపోవాలంటూ ప్రజలను హెచ్చరించారు. పాతకీలపట్ల రోడ్డు నుంచి డ్రైవర్స్ కాలనీ, రాఘవేంద్రస్వామి గుడి వైపు ఏనుగును మళ్లించగా ఓ చెరువు వద్ద అది ఆగిపోయింది.దీంతో వాహనదారులను,ప్రజలను రోడ్డుపై నిలబడకుండా పక్కకు తరలించిన తరువాత మళ్లీ ఏనుగు అడవివైపు ముందుకు సాగి, గంటావూరు వద్ద లేగదూడపై దాడి చేసి గాయపరిచింది.అటవీ శాఖ అధికారులు, ట్రాకర్లు , పోలీసులు 7గంటలపాటు శ్రమించిన తరువాత కానీ ఒంటరి ఏనుగును అడవిలోకి మళ్లించలేకపోయారు. బాణసంచా పేలుస్తూ,డప్పులు వాయిస్తూ ఉదయం 9 గంటలకు చిన్నూరు సమీపంలోని రాఘవేంద్రస్వామి గుడివద్దకు ఏనుగును తరలించారు. ఇక ఆలస్యం చేస్తే జనాలపైకి దూసుకొచ్చే ప్రమాదం ఉందని గ్రహించి రోడ్డుకు ఇరువైపులా గుమికూడిన ప్రజలను ముందుకు కదలకుండా ఆపేశారు. ఆ తరువాత ఏనుగును పొలాలు, చెరువుల మీదుగా గంటావూరు వద్దకు తరలించారు. అక్కడ ఫ్లైఓవర్ దాటించి అంజనేయస్వామి గుడి వెనుక ఉన్న అటవీ ప్రాంతంలోకి ఉదయం 11 గంటలకు అతికష్టంపై పంపించగలిగారు.



చిన్నూరు సమీపంలో

వరసిద్ధుడి దర్శనానికి 4 గంటలు



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరసిద్ధుడి ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా శనివారం జరిగిన పుష్పపల్లకి సేవకు రాష్ట్రం నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటకల నుంచి కూడా వేలాదిగా భక్తులు కాణిపాకానికి తరలివచ్చారు. కాణిపాక క్షేత్రంలో ఎటుచూసినా భక్తులే కనిపించారు. ఆలయ క్యూలైన్లు నిండిపోయి, దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బందితో కలిసి ఈవో పెంచలకిషోర్ తగిన ఏర్పాట్లు చేశారు.

పవన్ ఆదేశాలతో రంగంలోకి కుంకీలు



ఒంటరి ఏనుగును కట్టడి చేసేందుకు శనివారం సాయంత్రం ఎలిఫెంట్ క్యాంప్ నుంచి బయలు దేరిన కుంకీలు

పలమనేరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒంటరి ఏనుగును కట్టడి చేసేందుకు కుంకీలు రంగంలోకి దిగాయి.గంగవరంలో ఒంటరి ఏనుగు హల్‌చల్ చేయడం, అటవీశాఖ అధికారి సుకుమార్‌ను తీవ్రంగా గాయపరిచిన విషయం తెలిసి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు.దాన్ని కట్టడి చేసేందుకు వెంటనే కుంకీలను రంగంలోకి దించాలని జిల్లా అటవీ శాఖ అధికారికి ఆదేశాలిచ్చారు.దీంతో సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్,ఎఫ్ఆర్‌వో నారాయణ పలమనేరు సమీపంలోని ముసలిమడుగు వద్ద ఉన్న ఎలిఫెంట్ క్యాంపు లోని రెండు కుంకీలను గంగవరంలోని అంజనేయస్వామి గుడి వద్దకు తరలించారు. శనివారం మధ్యాహ్నం అడవిలోకి వెళ్లిన ఒంటరి ఏనుగు తిరిగివచ్చే అవకాశమున్నందున దాన్ని కట్టడి చేసేందుకు కుంకీలను సిద్ధం చేసినట్టు అటవీశాఖ అధికారులు చెప్పారు. ఇదే సమయంలో ఒంటరి ఏనుగు పలమనేరు పట్టణ పరిసరాల్లో సంచరించే అవకాశాలున్నందున ప్రజలెవరూ ఏనుగును చూసేందుకు ఆసక్తి చూపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, రేంజర్ నారాయణ సూచించారు.



వీరజవాన్ కార్తీక్‌కు ఘన నివాళి

బంగారుపాళ్యం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వీరజవాన్ పంగళ కార్తీక్ యాదవ్ మొదటి జయంతి సందర్భంగా శనివారం ఘన నివాళి అర్పించారు. అమర్‌జవాన్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట రక్తదానం శిబిరం నిర్వహించారు. అంతకుముందు కార్తీక్ స్వగ్రామమైన రాగిమానుపెంటలో వీరజవాన్ కుటుంబీకులను అమర్‌జవాన్ ట్రస్టు ఫౌండర్, మాజీ సైనికుడు మామిడి ఏడుకొండలు పరామర్శించారు. కార్తీక్ విగ్రహ ఏర్పాటుకు తన ట్రస్టు ద్వారా రూ.లక్ష చెక్కును అందజేశారు. అలాగే రాగిమానుపెంట ప్రభుత్వ పాఠశాల, బంగారుపాళ్యం పీవీఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన భార్గవి, నిఖిత, ధనుష్‌లకు బహుమతులు ప్రదానం చేశారు. మండలానికి చెందిన మాజీ సైనికులు కార్తీక్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. త్యాగరాజులునాయుడు, లీలా ప్రసాద్, సుజిత్, అభిషేక్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల శాఖ ఆఫీస్ సబార్డినేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ వాణిజ్య పన్నుల శాఖ ఆఫీస్ సబార్డినేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ చిత్తూరు ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం చిత్తూరు డివిజన్ వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కార్యాలయంలో ఎన్నిక జరిగిందని ఆల్ ఏపీ ప్రభుత్వ నాల్గవ తరగతి ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఏడు పోస్టులకు ఏడు దరఖాస్తులు రావడంతో కార్యవర్గాన్ని ఏకగ్రీవం చేసినట్లు చెప్పారు. చిత్తూరు జిల్లా ఉమ్మడి అధ్యక్షుడిగా మనోహరనాయక్, ఉపాధ్యక్షుడు-1గా తిప్పన్న, ఉపాధ్యక్షుడు-2గా సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా మునికృష్ణయ్య, కార్యాలయ కార్యదర్శిగా రవి, సంయుక్త కార్యదర్శిగా భరత్, కోశాధికారిగా షఫీ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా గోపాలకృష్ణయ్య, సహాయ ఎన్నికల అధికారిగా చెన్నకేశవులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఏపీ ప్రభుత్వ నాల్గవ తరగతి ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్ రఘురామకు ఘనస్వాగతం



మాట్లాడుతున్న రఘురామకృష్ణమరాజు - స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప సభాపతి రఘురామకృష్ణమరాజుకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. శనివారం బెంగళూరు నుంచి తిరుమలకు వెళుతున్న ఆయనకు చిత్తూరు శివారులోని ఇరువారం బైపాస్ రోడ్డువద్ద భారీ గజమాల, పుష్పాలతో స్వాగతం పలికారు. తొలిసారి చిత్తూరుకు రావడంతో టీడీపీ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. ఈ సందర్భంగా రఘురామకృష్ణమరాజు మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలు ముగిశాక ఒక రోజు చిత్తూరు నియోజకవర్గంలో పర్యటిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే జగన్మోహన్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి పనులను వేగవంతంగా చేయడానికి సహకరిస్తున్నారని తెలియజేశారు. మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ కాండ్ర రమేష్ నాయుడు, నేతలు కాజూరు బాలాజి, ఈశ్వర్ రావు, వెంకటేష్ యాదవ్, రాజశేఖర్, ఆనంద్, నరేష్, నళిని తిరుకుమరన్, జనార్దన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంటలపై ఆగని గజదాడులు

- లబోదిబోమంటున్న రైతులు

కల్లూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో గజదాడులు ఆగడం లేదు. శుక్రవారం రాత్రి పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని పెద్దవంక నుంచి బయలుదేరిన 12 ఏనుగుల గుంపు కల్లూరు సమీపంలోని రిలయన్స్ టవర్ వద్దకు చేరుకున్నాయి. కల్లూరులో షాజహాన్‌కు చెందిన మామిడితోటలో 35చెట్లను ధ్వంసం చేశాయి. కల్లూరులోని మౌలానా అజాద్, పుల్లావాండ్లపల్లిలోని శిద్దరాజు, కోటపల్లికి చెందిన గోపి, చంద్ర, నాగరాజులకు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. ఏనుగుల అలజడితో ఇదే మామిడితోటలోని గొర్రెలు బెదరడంతో రైతులు అప్రమత్తమై టపాకాయలు పేల్చారు. దీంతో 12 ఏనుగుల గుంపులో 11 ఏనుగుల గుంపు పెద్దవంక వద్దకు చేరుకున్నాయి.ఒంటరి ఏనుగు బీఎంసీ గోడౌన్ సమీపంలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిని దాటుకొని పాళెం పంచాయతీలోకి అడుగుపెట్టింది.



ధ్వంసమైన వరిపంట

సంజీవని ప్రాజెక్టుతో ప్రజారోగ్యం



సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సంజీవిని ప్రాజెక్టుతో ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని అందించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి, పీఎంకే ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేష్‌బాబు అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం సుమారు 40 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి, రాళ్ళబూదుగూరు క్లస్టర్ ఇన్‌చార్జి పీవీ నాగరాజు, మాజీ వైస్ ఎంపీపీ నందిగం ఉదయకుమార్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, శాంతిపురం క్లస్టర్ ఇన్‌చార్జి రాజేంద్ర, రాళ్ళబూదుగూరు మాజీ క్లస్టర్ ఇంచార్జి చంద్రశేఖర్, రెస్కో డైరెక్టర్లు బసవరాజు, చలపతి, అనుసూయ, ఏఎంసీ డైరెక్టర్లు శ్యామల, చంద్రకళ, హరినాథరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జిలు ఆర్ఎస్ మణి, లోకేష్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్, కడపల్లె యూనిట్ ఇన్‌చార్జి పెద్దన్న, నారాయణస్వామి, బాలు, సర్పంచ్ బాలకృష్ణ, మంజునాథరెడ్డి, సుగుణమ్మ, టీటీడీ బోర్డు సభ్యులు శాంతరాం, విజయకుమార్, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా మట్టి తరలింపు



బండ్లపల్లె వద్ద ప్రభుత్వ భూముల్లో ఎక్స్‌కవేటర్‌తో తీస్తున్న మట్టి

పుంగనూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం నుంచి కర్ణాటక, ఇతర పట్టణాలకు ప్రభుత్వ భూములు, చెరువుల నుంచి ఎర్రమట్టి, ఇసుక భారీగా తరలిపోతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ భూములు, చెరువుల రూపు రేఖలు మారుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో పలు విమర్శలకు దారితీస్తోంది. మండలంలోని బండ్లపల్లె, నెక్కుంది, ఏతూరు పంచాయతీలోని చెరువుల్లో ఎక్స్‌కవేటర్లతో తీసిన ఇసుక, మట్టిని టిప్పర్లతో అక్రమంగా తరలిస్తున్నారు. గత నాలుగు రోజులుగా రెండు ఎక్స్‌కవేటర్లు, 10 టిప్పర్లతో మట్టిని అక్రమ మార్గంలో రవాణా జరుగుతోందని ప్రజలు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు, ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



హిందీ కవుల వేషధారణతో విద్యార్థులు

శాంతిపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కూతగానిని పల్లె పరమహంస యోగానంద విద్యాలయంలో శనివారం హిందీ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. హిందీ భాషా గొప్పతనాన్ని విద్యార్థులు కవుల రూపంలో నాటికలు, నాట్యాలతో వివరించారు. పాఠశాల ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సన్, వైస్ ప్రిన్సిపల్ పార్థివ, ఉపాధ్యాయులు షఫీ, ఇర్ఫాన్, నాగమణి, ఉదయరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నల్లారి సోదరుల జన్మదిన వేడుకలు



పుంగనూరులో కేక్‌ను కట్ చేస్తున్న నాయకులు

పుంగనూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, బీజేపీ జాతీయ నాయకుడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను పుంగనూరులో టీడీపీ, బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో నల్లారి సోదరుల జన్మదిన సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నల్లారి కుటుంబం ప్రజల గుండెల్లో నిలిచిపోయిందని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఆసూరి బాలాజీ, జల్లి మనోహర్, నరేష్‌రాయల్, వెంకటస్వామి, సిరివేలు శ్రీనివాసులు, రెడ్డిప్రసాద్, సోమల సద్దాం, నూరుల్లా, బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, నరసింహులు, ఉస్మాన్, మణి తదితరులు పాల్గొన్నారు.

● **కల్లూరు:** పులిచెర్ల మండలం కల్లూరు నాలుగురోడ్ల కూడలిలో శనివారం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను కల్లూరుకి చెందిన టీడీపీ నాయకులు కరీముల్లా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు



కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బసవరాజాకు
వరసిద్ధుడి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బసవరాజా, పంచ సహస్రావధాని మేడసాని మోహన్ వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరిని ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు,ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు పాల్గొన్నారు.

రెండున్నర టన్నుల కూరగాయల వితరణ



వరసిద్ధుడి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన వెంకట్‌రెడ్డి శనివారం రెండున్నర టన్నుల కూరగాయలను వితరణ చేశారు. అన్నదాన సూపరింటెండెంట్ బాలరంగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమానికి రూ.లక్ష విరాళం

వరసిద్ధుడి ఆలయం వద్ద నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి అగరంపల్లెకు చెందిన ప్రసాద్‌రెడ్డి శనివారం రూ.1,00,116 విరాళంగా అందించారు.

బాధిత కుటుంబానికి ప్రమాద బీమా పంపిణీ



బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పలమనేరు టీడీపీ కార్యాలయంలో శనివారం టీడీపీ కార్యకర్త కుటుంబానికి పార్టీ తరపున అందిన రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అందజేశారు. బైరెడ్డిపల్లి మండలం లక్కనపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఎం.హరి జూన్ 6న గంగవరం మండలం ఆలకుప్పం నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కర్ణాటక బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు టీడీపీ సభ్యత్వం కలిగి ఉండటంతో ప్రమాద బీమా వర్తించింది. దీంతో పార్టీ తరపున అందిన రూ.5 లక్షల చెక్కును మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బైరెడ్డిపల్లి మండల టీడీపీ అధ్యక్షులు కిషోర్‌గౌడ, టీడీపీ నాయకులు రఘు చంద్రగుప్తా, దివాకర్‌రెడ్డి, చెన్నకృష్ణ, మంజునాథ, రెడ్డిప్రసాద్, గణేష్, జలందర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు నాలుగు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలమనేరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లి, వి.కోట మండలాలతో పాటు పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 14వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పలమనేరు ఏడీఈ వి.జీవన్‌కుమార్ తెలిపారు. పలమనేరులో 220 కేవీఏ సబ్‌స్టేషన్, వి.కోటలోని 132 కేవీఏ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తగా 220 కేవీఏ టవర్లు ఏర్పాటు చేస్తున్నందున అంతరాయం ఉంటుందని.. విద్యుత్ వినియోగదారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

నలగుండ్రాయస్వామి ఆలయంలో చోరీ

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడపనత్తం గ్రామంలోని నలగుండ్రాయస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. శనివారం ఉదయం ఆలయంలో పూజలు నిర్వహించడానికి వెళ్లిన అర్చకులు హుండీని పగలగొట్టి చోరీ చేసినట్లు గుర్తించి ఆలయ కమిటీకి సమాచారాన్ని అందించారు. ఆలయ ధర్మకర్త మురళీ, సభ్యులు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. బైరెడ్డిపల్లె పోలీసులు చేరుకుని పరిశీలించారు. ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

నేడు బైరెడ్డిపల్లెలో ఉచిత కంటి వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14న బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరోగ్యసేవా సంస్థ ఆధ్వర్యంలో చెన్నై శంకర్ నేత్రాలయ వైద్యులచే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ శ్రీనివాసులు, రమణ, గంగాధర్, మురళీకృష్ణ, చంద్రశేఖర్, చిన్నప్ప ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యనిపుణులు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేస్తారన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓబులేశ్వరస్వామి ఆలయంలో పూజలు



అలంకరణలో ఓబులేశ్వరస్వామి

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారిపల్లెలోని ఓబులేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత ఓబులేశ్వరస్వామికి అభిషేకం చేసి అలంకరణలు చేపట్టారు. కడపనత్తం నలగుండ్రాయస్వామి ఆలయం, పట్నపల్లె కల్యాణ వెంకటరమణస్వామి, కార్వేటికొండ ధ్యానాభిరామస్వామి, బైరెడ్డిపల్లె శేషాద్రిస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

టీడీపీ నాయకుడి మృతికి ఎమ్మెల్యే సంతాపం



దామోదర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

గంగవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండల టీడీపీ సీనియర్ నాయకులు దామోదర్‌రెడ్డి మృతి బాధాకరమని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. మండలంలోని మేలుమాయి గ్రామానికి చెందిన మాజీ ఏఎంసీ ఛైర్మన్ శ్రీరాములురెడ్డి కుమారుడు దామోదర్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఆకస్మికంగా మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం ఉదయం మేలుమాయి గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమశేఖర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి , నాయకులు శ్రీనివాసులు,సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సత్యప్రమాణం అనగానే చోరీ నగదు లభ్యం



సత్యప్రమాణాలకు వచ్చిన వారిని విచారిస్తున్న ఆలయ నిర్వాహకులు

చౌడేపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాల బండలో సత్యప్రమాణం అనగానే చోరీకి గురైన నగదు లభ్యమైన సంఘటన జరిగింది. చౌడేపల్లె మండలం అమినిగుంట పంచాయతీ రామయ్యగట్లకు చెందిన రాజశేఖర్ వ్యవసాయ కూలీగా పనులు చేసుకుంటూ జీవించేవాడు. నెల రోజుల క్రితం ఇంట్లో రూ. 50 వేల నగదును దాచాడు. వారం క్రితం డబ్బులు ఆచూకీ లభించలేదు. గ్రామ పెద్దల సూచనలతో రాజనాల బండలో సత్యప్రమాణానికి అనుమతి తీసుకుని చుట్టుపక్కల వారిని సత్యప్రమాణానికి రావాలని కోరారు. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు అతని ఇంటి ముందు గుడ్డలో డబ్బులు మూట కట్టి శుక్రవారం ఇంటి ముందు పడేసి వెళ్లారు. శనివారం ఉదయం రాజశేఖర్ లేవగానే ఇంటి ముందు నగదు లభించింది. ఈక్రమంలోనే రాజశేఖర్ కుటుంబసభ్యులు రాజనాలబండకు వెళ్లి పూజలు చేశారు.

22 నుంచి దసరా ఉత్సవాలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలు ఆలయాల్లో ఈనెల 22వ తేదీనుంచి దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు. గిరింపేట దుర్గాంబ, తేనెబండ ముత్యాయలమ్మ, వాసవీ కన్యకా పరమేశ్వరి, గుర్రప్ప నాయుడు వీధి అంకాళపరమేశ్వరి, గిరింపేట వాసవీమాత, చౌడేశ్వరి దేవి, సంతపేట కనకదుర్గ, పొన్నియమ్మ, కట్టమంచి కులందేశ్వర, గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర, కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వర, దుర్గానగర్ కాలనీ సర్వసిద్ధి వినాయక ఆలయాల్లో పది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు.

సామరస్య పరిష్కార వేదికే లోక్ అదాలత్



పలమనేరులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి వి. ఆదినారాయణ



కుప్పంలో కేసులు పరిష్కరిస్తున్న అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి రవి

పలమనేరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కక్షిదారులకు తమ కేసులను సామరస్య మార్గంలో పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ చక్కటి వేదిక అని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి వి. ఆదినారాయణ పేర్కొన్నారు. శనివారం పలమనేరులో జరిగిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడంతో కక్షిదారులకు విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే కేసులకు అదే తుది పరిష్కారంగా నిలుస్తుందని, సివిల్ దావాలపై కట్టిన ఫీజును తిరిగి పొందవచ్చన్నారు. శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో మొత్తం 245 కేసులు పరిష్కారమయ్యాయి. ఇందులో సివిల్ కేసులు 3, క్రిమినల్ కేసులు 186, బ్యాంకు వివాద కేసులు 56 పరిష్కరించబడ్డాయి. పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్, సీనియర్ న్యాయవాదులు రాజారెడ్డి, లక్ష్మీపతి, పరమశివప్ప, నారాయణరెడ్డి, ఆంజనేయులు, జూనియర్ న్యాయవాదులు, బ్యాంకు అధికారులు, పోలీసు అధికారులు, బీఎస్ఎన్ఎల్ అధికారులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

● **కుప్పం:** కుప్పం కోర్టు ఆవరణలో శనివారం అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె.రవి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో మొత్తం 83 కేసులకు సంబంధించి వివాద పరిష్కారాలు జరిగినట్లు కోర్టు వర్గాలు ప్రకటించాయి. ఇందులో 4 సివిల్ కేసులు (రూ.2.50 లక్షలు), 74 క్రిమినల్ కేసులు (రూ.7,89,685), 5 బ్యాంకు సంబంధిత కేసులు (రూ.19,74,542) పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కుప్పం ఏపీపీ ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసీ.చంద్రప్ప, న్యాయవాదులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● **పుంగనూరు రూరల్:** జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా పుంగనూరు కోర్టులో 137 కేసులు రాజీచేసి రూ.44.95 పరిహారంతో సమస్యలను సీనియర్ సివిల్ జడ్జి ఆరీఫా షేక్ పరిష్కరించారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జరిగిన లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్ కేసులు 137 కేసులను పరిష్కరించి అందులో రూ.44.94 లక్షలు కక్షిదారులకు ఇప్పించినట్లు తెలిపారు. లోక్‌అదాలత్‌లో పరిష్కరించిన కేసులపై అప్పీళ్లు పోవడానికి అవకాశాలు లేవన్నారు. కక్షిదారులు అనవసరంగా సమయం, డబ్బు వృథా కాకుండా సామరస్యంగా కేసులను రాజీ చేసుకోవడానికి లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు చెన్నకేశవులు, న్యాయవాదులు బాలాజీ, వెంకటముని, సురేశ్‌బాబు, ఆంజిబాబు, శివశంకర్‌నాయుడు, భాస్కర్‌రెడ్డి, ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరు : కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి షేక్ ఆరీఫా

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌కు కుప్పం నుంచి శ్రీకారం

● త్వరలో 80 వేల మందికి 42 ఆరోగ్యపరీక్షలు ● ఎమ్మెల్సీ కంచర్లశ్రీకాంత్

రామకుప్పం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు కుప్పం నియోజకవర్గం నుంచే శ్రీకారం చుట్టారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. శనివారం రామకుప్పం మండలం సచివాలయంలో పలువరికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు, గజదాడుల్లో పంటనష్టపోయిన వారికి నష్టపరిహారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ ఆరోగ్య సమస్యలతో సతమతమయ్యే వారు వైద్యచికిత్సల కోసం సీఎంఆర్ఎఫ్‌తోపాటు ఏ ఒక్కరి సాయాన్ని కోరే పరిస్థితి ఉండరాదన్నదే సీఎం ధ్యేయమన్నారు. అందులో భాగంగానే ఆరోగ్యాంధ్రప్రదేశ్‌కు తొలిఅడుగుగా కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా టాటాకన్సల్టెన్సీ సౌజన్యంతో సంజీవని పథకాన్ని ప్రారంభించారన్నారు. ఇకపై కుప్పం నియోజకవర్గం నుంచి రోగులు వైద్యపరీక్షలు, చికిత్సల కోసం వ్యయప్రయాసలతో సుదూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేదన్నారు. సంజీవని ప్రాజెక్టుకు నియోజకవర్గంలోని 13 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను అనుసంధానం చేశారన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో త్వరలోనే వైద్యపరీక్షలు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. రామకుప్పంలో ఆయన 27 బాధిత కుటుంబాలకు రూ.21.5 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, 39 మంది గజబాధిత రైతులకు రూ.3.21 లక్షల విలువైన నష్టపరిహారం చెక్కులను ఆయన పంపిణీ చేశారు. సమావేశంలో గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, టీడీపీ మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహులు, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, వైస్‌ఎంపీపీ వెంకట్రామగౌడు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, ఏఎంసీ మాజీ వైస్‌ఛైర్మన్ సీతాపతి, సింగిల్‌విండో అధ్యక్షుడు మహ్మద్‌రఫీ, రెస్కో డైరెక్టరు విజయ్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్లు పవన్, మునీంద్రనాయక్, బీజేపీ మాజీ జిల్లా కార్యదర్శి రాజసింహా, జనసేన మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్, గుర్రప్ప, గంట్లప్పగౌడు, జయశంకర్, కొళ్ళపల్లెబాబు, రామకృష్ణప్ప, మంజునాథరెడ్డి, రవిరెడ్డి, మునస్వామిశెట్టి, జేయి, వెంకటరమణ, గిరిదాసు, బాలరాజు, సుబ్రీ, ఆదిల్, మంజునాథ్, అల్లీశీన, జ్ఞానశేఖర్‌రెడ్డి, మురళీమోహన్, రఘు, మురళీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కంచర్ల శ్రీకాంత్

రైతు సంక్షేమం పేరుతో దగా



విలేకరులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు భాస్కర్

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామంటున్న సీఎం చంద్రబాబునాయుడు రైతులను దగా చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ ఆరోపించారు. శనివారం పుంగనూరులో విలేకరులతో మాట్లాడుతూ రైతులకు అవసరమైన యూరియా అందివ్వడంలో పూర్తిగా విఫలమయ్యారని, మామిడి, టమోటా పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించలేకపోతున్నారని వాపోయారు. సమావేశంలో నాయకులు అయూబ్, నూర్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి ఏఎస్ఐ అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఏఎస్ఐ

పుంగనూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన అనాథ మృతదేహానికి శనివారం ఏఎస్ఐ అశ్వర్థనారాయణ అంత్యక్రియలు నిర్వహించారు. లేవలేని స్థితిలో భిక్షాటనకు వెళ్లలేక గత పది రోజులుగా పడి ఉన్న ఓ యాచకుడిని ఏఎస్ఐ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్సలు చేయించారు. మూడు రోజులుగా చికిత్సలు పొంది కోలుకున్న లోకేశ్ శుక్రవారం మృతిచెందాడు. అనాథ కావడంతో పుంగమ్మ చెరువు శ్మశానంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సహాయంతో ఏఎస్ఐ అశ్వర్థనారాయణ అంత్యక్రియలు చేశారు. సొంత ఖర్చులతో ఇప్పటికే పుంగనూరులో ముగ్గురికి అంత్యక్రియలు చేశారని ఆయన సేవలను అభినందించారు. పుంగనూరు సీఐ సుబ్బరాయుడు, టీడీపీ నాయకులు సీవీరెడ్డి, సుహేల్‌బాషాలు ఏఎస్ఐ అశ్వర్థనారాయణ సేవలను కొనియాడుతూ సత్కరించారు.

వన వేణుగోపాలుడికి క్షీరాభిషేకం



వెదురుకుప్పం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఏర్పాట్లను ఆలయ నిర్వాహకుడు శివకుమార్ పర్యవేక్షించారు.

పి.చెరుకువారిపల్లె నుంచి తిరుమలకు పాదయాత్ర



తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న భక్తులు

సోమల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం తమ్మినాయనపల్లె పంచాయతీ పి.చెరుకువారిపల్లెకు చెందిన 111 మంది భక్తులు శనివారం స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. గత 17 సంవత్సరాలుగా గ్రామస్తులు ఏటా తిరుమలకు పాదయాత్ర చేయడం కొనసాగుతోంది. ఈక్రమంలోనే కందూరు, కలికిరి మీదుగా పాదయాత్ర ప్రారంభించారు.

వ్యవసాయ బోర్ల విద్యుత్ తీగల చోరీ

సోమల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరు పంచాయతీ తొప్పన్నగారిపల్లె, కమ్మపల్లె గ్రామాలకు చెందిన రైతు పొలాల వద్ద బోర్లకు అమర్చిన విద్యుత్ తీగలు, బావుల వద్ద మోటార్ల తీగలను దుండగలు శుక్రవారం రాత్రి చోరీ చేసినట్లు రైతులు తెలిపారు. నెలక్రితం విద్యుత్ తీగలు చోరీ జరిగి మళ్లీ అదే ప్రాంతాల్లో చోరీలు జరగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తొప్పన్నగారిపల్లెలోని కుమార్, కమ్మపల్లెలోని సతీష్, రమేష్‌లకు చెందిన విద్యుత్ తీగలు చోరీకి గురయ్యాయి.

అక్కదేవతలకు అభిషేక పూజలు



గట్టువారిపల్లెలో అక్కదేవతలు

సోమల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం గట్టువారిపల్లెలో కొలువుదీరిన అక్కదేవతల ఆలయంలో శనివారం అభిషేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గట్టువారిపల్లె, నవరంవారిపల్లె, గురికానివారిపల్లె, శీలంవారిపల్లె, గాంధీనగర్, చీకలవారిపల్లె, కమ్మపల్లె గ్రామ భక్తులు ఆలయం వద్దకు చేరుకొని భక్తి శ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కుప్పం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే అథారిటీ విజ్ఞప్తి మేరకు 220కేవీ విద్యుత్తు లైన్ పనులు చేస్తున్నందున కుప్పం నియోజకవర్గ పరిధిలోని కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాలతోపాటు కుప్పం పురపాలక సంఘం పరిధిలో ఆదివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని రెస్కో ఎండీ సోమశేఖర్ తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రేపు వ్యవసాయ పాలిటెక్నిక్‌లో స్పాట్ కౌన్సెలింగ్

చౌడేపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15న వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీ లో చేరే విద్యార్థులకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మదన్‌మోహన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గుంటూరు జిల్లాలోని కృష్ణ ఆడిటోరియంలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిప్లొమో పూర్తి చేసిన విద్యార్థులు బీఎస్సీ అగ్రికల్చర్‌తో పాటు డిగ్రీ కోర్సులలోనూ చేరొచ్చన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

సీఎంను కలిసిన ఎమ్మెల్యే, టీడీపీ నేతలు



సీఎం చంద్రబాబుకు వివాహ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎన్పీ జయప్రకాష్

బంగారుపాళ్యం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే మురళీమోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్, గౌరవ అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్ శనివారం అమరావతిలో కలిశారు. ఎన్పీ జయప్రకాష్ కుమార్తె ప్రణతి వివాహం బెంగళూరులో ఈనెలలో జరగనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. వీరివెంట క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌నాయుడు, పీఆర్వో ప్రవీణ్‌చౌదరి ఉన్నారు.

వైభవంగా యల్లమాంబ పుష్పపల్లకి సేవ





పుష్పపల్లకిలో ఊరేగుతున్న అమ్మవారు - ఆలయంలో యల్లమాంబ

యాదమరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కీనాటంపల్లెలోని యల్లమాంబకు పుష్పపల్లకి సేవను శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పుష్పకైంకర్యం, అభిషేకాలు చేశారు. అంతకుముందు వేకువజామున సుగంధ పుష్పాలు, విద్యుత్ దీపాలంకరణతో పుష్ప పల్లకివాహనంలో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, బాణాసంచా వేడుకలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం వసంతోత్సవం నిర్వహించాక అమ్మవారిని తిరిగి పరదరామి ప్రధాన ఆలయానికి చేర్చడంతో జాతర ముగిసింది.

22 నుంచి దసరా ఉత్సవాలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ఆలయాల్లో ఈనెల 22వ తేదీనుంచి దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు. గిరింపేట దుర్గాంబ, తేనెబండ ముత్యాయలమ్మ, వాసవీ కన్యకా పరమేశ్వరి, గుర్రప్ప నాయుడు వీధి అంకాళపరమేశ్వరి, గిరింపేట వాసవీమాత, చౌడేశ్వరి దేవి, సంతపేట కనకదుర్గ, పొన్నియమ్మ, కట్టమంచి కులందేశ్వర, గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర, కామాక్షి అంబికా సమేత అగస్తీశ్వర, దుర్గానగర్ కాలనీ సర్వసిద్ధి వినాయక ఆలయాల్లో పది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. అలాగే వైష్ణవాలయాలైన కోదండరామ, పొన్నయమ్మ గుడి వీరాంజనేయ స్వామి, సంతపేట విజయలక్ష్మికాలనీ శ్రీరంగనాథ, సీబీ రోడ్ వీరాంజనేయ, ప్రశాంత్ నగర్ కాలనీ వరాహస్వామి ఆలయాల్లో దశావతార సాక్షాత్కార ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయాల ఈవోలు, పాలకవర్గాల ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

అశ్వవాహనంపై పొన్నియమ్మ విహారం



నింద్ర, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపల్ పరిధి కేవీపీఆర్ పేటలో పొన్నియమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం అశ్వవాహనంపై విహరించారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి, కర్పూర హారతులు పట్టి దర్శించుకున్నారు. ఊరేగింపు ఆద్యంతం బాణసంచా వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

తాగునీటి అక్రమ వాడకాన్ని అడ్డుకోండి



ట్యాంకుకు పైపు పెట్టి తాగునీటిని అక్రమంగా వాడుతున్న వైనం

విజయపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేశవపురం ఆదిఆంధ్రవాడలో అక్రమంగా తాగునీటిని వాడేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే ఎంపీడీవో రాజేంద్ర స్పందించి ఉదయం తొలగిస్తే సాయంత్రానికి మళ్లీ అక్రమంగా తాగునీటి వాడేస్తున్నారని చెబుతున్నారు. అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దుర్గంధం నడుమ మరుగుదొడ్లు

● చిత్తూరు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఇదీ పరిస్థితి





మరమ్మతులకు గురైన మరుగుదొడ్లు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మరుగుదొడ్లు మరమ్మతులకు గురై దుర్గంధం వెదజల్లుతున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో బస చేసే గెస్టులను కలవడానికి వచ్చేవారు వేచి ఉండటానికి హాల్, రిసెప్షన్, డైనింగ్ రూమ్‌లున్నాయి. వీటిమధ్య ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల నుంచి వచ్చే దుర్గంధాన్ని భరించలేక ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. దీనిపై ఇప్పటికే అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని సందర్శకులు చెబుతున్నారు. ఇకనైనా మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

16వేల పశువులకు టీకాలు సిద్ధం

వెదురుకుప్పం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండల పరిధిలో 16వేల పశువులకు వేయడానికి గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు అన్ని పశువైద్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. ఈ మేరకు వెదురుకుప్పం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ రూపసుందరి శనివారం తెలిపారు. సోమవారం నుంచి అక్టోబరు 15వ తేదీవరకు ఈ టీకాలను వేస్తామని.. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'మామిడి రైతులకు మద్దతు ధర చెల్లించాలి'

తవణంపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర టన్నుకు రూ.8 వేలను చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. అరగొండ రామాలయంలో శనివారం మామిడి రైతులు సమావేశమై ఈ మేరకు నిరసన తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను జ్యూస్ ఫ్యాక్టరీ యజమానులు చెల్లించాలని కోరారు. రైతు నాయకులు హరిబాబు నాయుడు, జయప్రకాష్, సుదీర్, సుకుమార్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



అరగొండలో నిరసన తెలుపుతున్న మామిడి రైతులు









కాణిపాకంలో జరుగుతున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా వరసిద్ధుడి ఆలయం వద్ద రోజాపూలు, ఎండు ఖర్జూరాలతో ఏర్పాటు చేసిన వినాయకుడి ప్రతిమలు- ఆస్థాన మండపంలో ప్రదర్శించిన భక్త ప్రహ్లాద పౌరాణిక నాటిక - కళాకారిణి నృత్యం - విదేశీ పుష్పాలతో అలంకరించిన ధ్వజస్తంభం

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు





కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బసవరాజాకు వరసిద్ధుడి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో పెంచలకిషోర్ - ఆలయంలో మేడసాని మోహన్

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బసవరాజా, పంచ సహస్రావధాని మేడసాని మోహన్ వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరిని ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు,ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

రెండున్నర టన్నుల కూరగాయల వితరణ

వరసిద్ధుడి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన వెంకటరెడ్డి శనివారం రెండున్నర టన్నుల కూరగాయలను వితరణ చేశారు. అన్నదాన సూపరింటెండెంట్ బాలరంగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమానికి రూ.లక్ష విరాళం

వరసిద్ధుడి ఆలయం వద్ద నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి అగరంపల్లెకు చెందిన ప్రసాద్‌రెడ్డి శనివారం రూ.1,00,116 విరాళంగా అందించారు.



కొత్తకాలనీలో సమస్యల దరువు

ఇబ్బంది పడుతున్న స్థానికులు





కొత్తకాలనీలో వీధుల దుస్థితి - పునాదుల దశ దాటని ఇంటి నిర్మాణాలు



వెదురుకుప్పం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె గ్రామ పంచాయతీలోని కొత్తకాలనీలో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు సొంతింటి కల నెరవేరుస్తామని అప్పటి పాలకులు ఇక్కడ స్థలాలను కేటాయించారు. ఆ మేరకు మౌలిక వసతులు కల్పించలేదు. అరకొరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకుని కాపురం వచ్చినా విష పురుగుల బెడదతో బిక్కుబిక్కుమంటూ కాలంగడుపుతున్నారు. ఈ కాలనీలో 82 మందికి గృహ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చినా వారికి నిధులు ఇవ్వలేదు. దాంతో చాలా నిర్మాణాలు పునాదుల దశలోనే ఉన్నాయి. తాగునీటి వసతికి పైపు లైన్లు వేసినా ఆ నీటిలో పురుగులు వస్తున్నాయని స్థానికులు తెలిపారు. వీధులన్నీ రాళ్లు, రప్పలతో అధ్వానంగా ఉన్నాయి. అసంపూర్తి భవనాల చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి పాముల బెడద ఎక్కువైంది. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం వల్ల ఇంటి నిర్మాణాలు, వసతులు కల్పించలేదని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఫేక్ లింకులపై క్లిక్ చేయొద్దు: ట్రాఫిక్ సీఐ

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'సామాజిక మాధ్యమాల్లో ట్రాఫిక్ ఈ-చలానాలకు 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు తప్పుడు లింకులు షేర్ అవుతున్నాయి. వాటిని క్లిక్ చేసి మోసపోవద్దు' అని ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. లోక్ అదాలత్ సందర్భంగా మీ వాహనాలపై ఉన్న చలానాలకు 50 శాతం రాయితీ ఇస్తున్నారని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లలో విస్తృతంగా ప్రచారం అవుతోందన్నారు. ట్రాఫిక్ పోలీసులు ఇలాంటి వెబ్‌సైట్‌లో చలానాలు కట్టమని చెప్పరని, ఏదైనా ఉంటే నేరుగా కట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. చలానాదారులకు ఏదైనా సందేహాలుంటే నేరుగా పోలీసులను సంప్రదించాలని శనివారం ఒక ప్రకటనలో సూచించారు.

లోక్ అదాలత్‌లో 73 కేసుల పరిష్కారం

నింద్ర, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరి జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం 73 కేసులు పరిష్కారమయ్యాయి. రూ.22,79,210 సెటిల్‌మెంట్ జరిగింది. నగరి ఇన్‌చార్జి జడ్జి సి.జానకి సమక్షంలో నిర్వహించిన ఈ లోక్ అదాలత్‌లో సీనియర్ న్యాయవాదులు, బ్యాంకు మేనేజర్లు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గురజాల చెన్నకేశవులుకు డాక్టరేట్ ప్రదానం



చిత్తూరు సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడికి డాక్టరేట్ ప్రదానం చేశారు. శనివారం బెంగళూరులో భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ వారు డాక్టరేట్ పట్టాను అందజేశారు. జీజేఎం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండేషన్ ద్వారా చెన్నకేశవులు నాయుడు చేస్తున్న సేవలను గుర్తించి డాక్టరేట్ ఇచ్చారు.

కవి హరికృష్ణారెడ్డికి సత్కారం



పెనుమూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దాసరపల్లెకు చెందిన ప్రముఖ కవి హరికృష్ణారెడ్డిని చిత్తూరు కెనరా బ్యాంకు అధికారులు శనివారం సత్కరించారు. పులిగుంటీశ్వర ప్రకృతి రైతుసేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసి.. దాని ద్వారా చేస్తున్న సేవలను గుర్తించి ఆయనకీ సన్మానం చేశారు.

ఖాళీ స్థలాలను ఇలా వదిలేస్తారా?

● రోగాల బారిన పడుతున్న స్థానికులు





ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, (ఇన్‌సెట్లో) పందుల సంచారం

నగరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలు అనారోగ్యానికి నిలయాలుగా మారాయి. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయి.. పందులు, పాములు, దోమలకు ఆవాసంగా మారాయి. మరోవైపు మురుగు చేరి, దుర్గంధం వెదజల్లుతోంది. మున్సిపల్ కార్యాలయ సమీపంలోని ఆనం లలితా లేఅవుట్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. దీనివల్ల పరిసరాల్లో జనం తరచూ రోగాల బారిన పడుతున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోతోందని ఆనం లలితా లేఅవుట్‌కు చెందిన ఏకాంబరం చెబుతున్నారు.

ప్రారంభించారు.. వదిలేశారు!

● నిరుపయోగంగా హెల్త్ క్లినిక్ భవనం



నింద్ర, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అగరం గ్రామ పంచాయతీలో లక్షలు వెచ్చించి నిర్మించిన హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభించి.. వదిలేశారు. దీనివల్ల ఆ భవనం నిరుపయోగంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భవనం ఖాళీగా ఉండటంతో మందుబాబులకు నిలయంగా మారిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భవనాన్ని ప్రజలకు అందుబాటులో తేవాలని కోరుతున్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నవారిని శనివారం సన్మానించారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకుడైన బండారు శరశ్చంద్రశేఖర్‌ను స్థానికంగా జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు, ప్రముఖులు త్రిశంకర్‌రెడ్డి, వీరరాఘవ నాయుడు, గిరిబాబు, జయరాం, చిట్టిబాబు, కుమార్ తదితరులు సత్కరించారు. ఎస్టీయూ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యారంగ పరిరక్షణకు కృషి చేసిన గంటా మోహన్‌తోపాటు రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు సాధించిన నౌషాద్, గోపినాథ్, కమలాపతి, సుబ్రహ్మణ్యం, మీనాక్షి, రాధాకుమారి, ప్రసన్నకుమారి, రామకృష్ణ, ఆనందయ్య తదితరులను సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మదన్మోహన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పురుషోత్తం, చంద్రన్, జార్జి, రమేష్, డిల్లీబాబు, త్యాగరాజులు, సురేష్, సుబ్రహ్మణ్యం, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.





అధ్యాపకుడు శరశ్చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు - ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన ఎస్టీయూ నేతలు

సంక్షిప్తంగా..

29 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 29మందికి జరిమానా విధించారు. నాలుగు రోజులుగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 29 మందిపై కేసు నమోదు చేశారు. వీరిని శనివారం జూనియర్ సివిల్ కోర్టులో హాజరు పరిచారు. విచారించిన జడ్జి ఉమాదేవి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున 29 మందికి రూ.2.90 లక్షల జరిమానా విధించారని ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

వన వేణుగోపాలుడికి క్షీరాభిషేకం



ప్రత్యేక అలంకరణలో వనవేణుగోపాలుడు

వెదురుకుప్పం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఏర్పాట్లను ఆలయ ప్రధాన కార్యనిర్వాహకుడు శివకుమార్ పర్యవేక్షించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వెదురుకుప్పం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శనివారం సాయికృష్ణ కుటుంబీకులు అన్నదానం చేశారు. అలాగే స్వీట్లు, పండ్లను కూడా అందజేశారు.

టూరిజం డైరెక్టర్‌గా మునిరత్నం



వడమాలపేట, సెప్టెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని పత్తిపుత్తూరుకు చెందిన సీనియర్ టీడీపీ నాయకులు సీగే. మునిరత్నంను ఏపీ టూరిజం డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. టూరిజం శాఖ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలియజేశారు.

పైపులైన్‌కు మరమ్మతులు



చిన్నజంబాడ వద్ద జరుగుతున్న పనులు

విజయపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జంబాడ నుంచి నారపరాజు కండ్రిగకు రాజీవ్ టెక్నాలజీ తాగునీటి సరఫరా చేసే పైపులైన్‌కు శనివారం మరమ్మతులు నిర్వహించారు. ఫైబర్ నెట్ పేరుతో రోడ్డుపక్కన విచ్చల విడిగా ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తీయడం వల్లే తరచూ పైపులైన్ మరమ్మతులకు గురై తాగునీటి సమస్య ఏర్పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.